# ఛలో ఢిల్లీకి కదలండి.. మార్పు కోసం గళమెత్తండి

**- కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య**



ఇది కద నిజం, కుక్కునూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న "బద్లావ్ జరూరీ హై -- మార్పు కావాలి" మహార్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టాలని, సార్వత్రిక విద్య, వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు, నిరుద్యోగులకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు పరిధిలో మిగిలి ఉన్న భూములకు కుక్కునూరు మండలాన్ని యూనిట్‌గా పరిగణించి పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన తరహాలోనే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే మహార్యాలీకి ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కొన్నె లక్ష్మయ్య కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వరకా శ్యామల, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు పాల్గొన్నారు.

# పిట్లంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం :రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పిట్లం పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం, పరస్పర ప్రేమాభిమానాలు, రక్షణకు రాఖీ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని రాఖీలు కట్టారు. కార్యక్రమాల్లో మహేష్, రంజిత్, హనుమాన్లు, ఉడుగుల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నూతన కమిటీలు ఏర్పాటు



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):– పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు మాదిగ సూచనల మేరకు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల ఇన్‌చార్జి చింతగుంట అంకయ్య మాదిగ అధ్యక్షతన రాపూరు మండల ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మంగలపూరి వెంకటేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా శేషం శివశంకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కుంచం పరుశురాం మాదిగ, అధికార ప్రతినిధిగా బక్క శివ శంకర్ మాదిగ, కోసాధికారిగా యేసుపోగు పెంచలయ్య మాదిగ, కార్యదర్శిగా పచ్చిగల్ల వెంకటరమణయ్య మాదిగ, ఎన్నికయ్యారు. అదే విధంగా ఎం ఎస్ పి మండల అధ్యక్షుడిగా నిప్పట్లపల్లి రత్నయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా తూమాటి వెంకటరమణయ్య మాదిగా,ప్రధాన కార్యదర్శిగా కత్తి రఘు మాదిగ, అధికార ప్రతినిధిగా తాడి రాజా మాదిగ, కోసాధికారి గా చింతగుంట శ్రీనివాసులు మాదిగ, కార్యదర్శిక బక్క వెంకటరమణయ్య మాదిగ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మాదిగల హక్కుల సాధన కోసం నూతన కమిటీలు చురుగ్గా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):–స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ గంధం వేణు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. హనుమంతయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ, గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన వ్యావహారిక భాషా ఉద్యమ సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటూ, మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్కిలి కాకతీయ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు టి. సుజాతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాచీన కవిత్వం నుంచి ఆధునిక కవిత్వం వరకు తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పులను, భాషా సౌందర్యాన్ని వివరించారు. అమ్మ నుంచి నేర్చుకునే మాతృభాషకు మన జీవితంలో ఎంతో ప్రాధాన్యత ఉందని కన్నతల్లికి ఎంతటి గౌరవం ఇస్తామో,మన మాతృభాష అయిన తెలుగుకు కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వాలి అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, మరియు విద్యార్థులు, పాల్గొన్నారు.

# నకిలీ నోట్ల ముఠాకు పిట్లం పోలీసుల చెక్

- ముగ్గురు అరెస్ట్ పెట్రోల్ బంక్‌లో నకిలీ కరెన్సీ చలామణి
- సాంకేతిక ఆధారాలతో ముఠా గుట్టురట్టు
- రూ.91 వేల నకిలీ కరెన్సీ, కారు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం



ఇది కద నిజం :కామరెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు పిట్లం పోలీసులు చెక్ పెట్టారు. పెట్రోల్ బంక్‌లో నకిలీ రూ.500 నోట్లు చలామణి చేసి పరారైన ముగ్గురు నిందితులను సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.91 వేల విలువైన 182 నకిలీ రూ.500 నోట్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పిట్లంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో రూ.2 వేల పెట్రోల్ పోయించుకుని నాలుగు నకిలీ రూ.500 నోట్లు ఇచ్చి పరారైన ఘటనపై పిట్లం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, పిట్లం ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు మరింత నకిలీ కరెన్సీ చలామణి చేసేందుకు వెళ్తుండగా ధర్మారం టోల్‌ప్లాజా సమీపంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పిట్లం ఎస్సై ఆంజనేయులు, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్యతో పాటు పోలీస్ సిబ్బంది శైలేష్, రాము, వెంకటేష్‌లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు.

# పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికలు అవినాష్ రెడ్డికి పరీక్ష కాబోతున్నాయా..?



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 29:

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి ఇది పరీక్షా కాలమా..? రాజకీయంగా తన ఉనికిని, సమర్థతను నిరూపించుకోవడానికి అవినాష్ రెడ్డికి వైసీపీ చీఫ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చివరి పరీక్ష పెట్టబోతున్నారా..? ఇందుకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే వేదిక కానున్నాయా..? సొంత గడ్డ పులివెందులపై వైసీపీని గెలిపించి, తన సత్తా ఏంటో చూపించుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఇప్పుడు అవినాష్ రెడ్డికి ఏర్పడిందా..? అంటే అవును అంటున్నాయి మేధావి వర్గాలు.. పులివెందుల నియోజకవర్గ పరిధిలో కూటమి ప్రభుత్వాన్ని అడ్డుకోవడం ప్రస్తుతం అవినాష్ ముందున్న అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. గతంలో జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాన్నే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేసేందుకు టీడీపీ చింతమవుతున్నట్టు సమాచారం. పులివెందుల మున్సిపాలిటీతో పాటు గ్రామీణ పరిధిలోని ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో అత్యధికంగా ఏకగ్రీవాలు సాధించాలని టీడీపీ పట్టుదలతో యోచిస్తోంది. ఐతే.. ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అంగీకరించనని, అలాంటి చోట్ల ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కట్ చేస్తానంటూ వైఎస్ జగన్ ఇప్పటికే సొంత పార్టీ నేతలకు తనదైన స్టైల్ లో స్మూత్ గా మాస్ వార్నింగ్ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో ఏకగ్రీవాలు కాకుండా చూసుకోవడం అవినాష్ రెడ్డికి పెద్ద టాస్క్‌గా మారింది. గతంలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో అధికార పక్షం వ్యూహాలను తిప్పికొట్టడంలో అవినాష్ రెడ్డి ఫెయిల్ అయ్యారనే అసంతృప్తి జగన్‌లో ఇప్పటికే ఉంది. ఈసారి అలా కాకుండా నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్ వరకు అభ్యర్థులకు అండగా నిలవడం, అవసరమైన వారికి ఆర్థిక భరోసా కల్పించడం వంటి విషయాలలో అవినాష్ రెడ్డి బాధ్యతగానే తీసుకుంటారని అనిపిస్తుంది. ఈ భారీ టాస్క్‌లో అవినాష్ రెడ్డి సక్సెస్ కాకపోతే.. ఆయనను పార్టీ కీలక బాధ్యతల నుంచి వైఎస్ జగన్ పూర్తిగా పక్కన పెడతారన్న టాక్ వైసీపీ వర్గాల్లో జోరుగా నడుస్తోంది. పులివెందులలో ఏకగ్రీవాలు కాకుండా అడ్డుకుని, జగన్ పెట్టిన ఈ చివరి పరీక్షలో నెగ్గితేనే అవినాష్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు నిలబడుతుంది. లేదంటే ఆయనకు సొంత పార్టీలోనే ప్రాధాన్యం తగ్గడం ఖాయంగా కనిపిస్తోందన్న గుస,గుసలూ వినిపిస్తున్నాయి. జగన్ మోహన్ రెడ్డి పరీక్షను తట్టుకుని అవినాష్ రెడ్డి నిలబడతాడా? లేక ఏకగ్రీవాలకు బలవుతారా.? అన్నది వేచి చూడాల్సిందే.. అంటున్నారు కడపజిల్లా ప్రజలు...

# ఎల్‌నినో ప్రభావం నుంచి ఉద్యాన పంటల రక్షణకు ఉపశమన చర్యలు

**నిమ్మ రైతులతో ముఖాముఖి నిర్వహించిన ఉద్యానశాఖ డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు**




నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):–నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలం గిలకపాడు గ్రామంలో శనివారం ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు నిమ్మ రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాలు చల్లిన నిమ్మ తోటలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నుంచి ఉద్యాన పంటలను రక్షించేందుకు రైతులు పలు ఉపశమన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో ఉపశమన చర్యల్లో భాగంగా పీఎండీఎస్ విత్తనాలను పండ్ల తోటల మొదళ్లలో వేయడం వల్ల వర్షాలు ఆలస్యమయ్యే ప్రాంతాల్లో మొక్కలు ఎండిపోకుండా కాపాడటంతో పాటు నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి భూసారం మెరుగుపడుతుందని తెలిపారు.

రైతులకు చదరపు మీటరుకు రూ.15 రాయితీతో వీడ్ మ్యాట్ అందిస్తున్నామని చెప్పారు. వీడ్ మ్యాట్ వినియోగం ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుందని,కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని తెలిపారు.

అలాగే వర్షపు నీటిని నీటి కుంటల ద్వారా నిల్వ చేసుకుని పంటకు అవసరమైన కీలక సమయాల్లో వినియోగించుకోవచ్చన్నారు. 20ఐ20ఐ3 మీటర్ల కొలతలతో వ్యక్తిగత నీటి కుంటల నిర్మాణానికి ఉద్యానశాఖ ద్వారా రైతులకు గరిష్ఠంగా రూ.90 వేల వరకు రాయితీ అందజేస్తున్నట్లు వివరించారు.డ్రిప్ సేద్యం ద్వారా మొక్కలకు అవసరమైన మోతాదులోనే నీటిని అందించి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, డ్రిప్ పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటలను రక్షించుకోవాలని డా. శ్రీనివాసులు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎం.వి. సుబ్బారెడ్డి, ఉద్యాన అధికారులు సాయి లక్ష్మీ,వ్యవసాయ శాఖ అధికారి సోము సుందర్, ఆర్ఎస్‌కే సిబ్బంది, నిమ్మ రైతులు పాల్గొన్నారు.

# రక్తదానం చెయ్యండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి..




- రక్తదానం చేస్తే ఇతరులకు జీవితం ప్రసాదించినట్లే.
- జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు

ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 29:

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడిన పుణ్యం దక్కుతుందని రక్తదానం ప్రాణదానంతో సమానమని, జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు పేర్కొన్నారు. ఈరోజు కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అక్టోబర్ 31వ తేదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి పురస్కరించుకొని వివిధ రకాల సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈరోజు జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్లో డిఎస్పి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఆరోగ్యవంతులైన యువకులు మరియు పలువురు వ్యక్తుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కొంతమంది రక్తదానం చేస్తే శరీరం సచ్చు బడుతుందని, వారు తమ శక్తిని కోల్పోతారని అపోహలో ఉంటారని తెలిపారు. కానీ రక్తదానం ఇవ్వడం వల్ల శరీరంలో ఐరన్ శాతం పెరుగుతుందని మరియు రక్తంలో ఉండే అధిక కొవ్వు శాతం తొలగిపోయి గుండె జబ్బులు రాకుండా, అధిక కొవ్వు రక్తంలో పెరగకుండా రక్తం పలుచబడడం జరుగు తుందని, దీని ద్వారా ఎలాంటి గుండె జబ్బులు రాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కావున రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని గుండెకు సంబంధిత వ్యాధులు రాకుండా జీవితం ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలని సూచించారు. ఈ మేరకు జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు, ఎస్సై సత్యనారాయణ, పలువురు పోలీసు సిబ్బంది రక్తదానం చేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం దాదాపు 120 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి రక్తాన్ని శుభ్రపరిచి అవసరమైన వారికి రక్తాన్ని అందజేస్తామని ప్రొద్దుటూరు రక్త నిల్వ కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ శశికళ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రక్త నిధి నిల్వ కేంద్రం టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, జమ్మలమడుగు రక్తనిధి కేంద్రం ఇంచార్జ్ నెల్సన్, జమ్మలమడుగు ప్రభుత్వ వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పెద్ద ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు గ్రహీత బాబ్జికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సన్మానం.

ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్ట్ 29: జిల్లా ఉత్తమ లైబ్రేరియన్ గా కడపలో అవార్డు తీసుకున్న జమ్మలమడుగు లైబ్రేరియన్ బాబ్జికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు గ్రంథాలయం నందు శాలువా కప్పి సన్మానించడం జరిగిందని, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు, యువతకు పోటీ పరీక్షలలో భాగంగా గ్రంథాలయాలు చాలా వరకు ఉపయోగపడతాయని అన్నారు. ఇటువంటి తరుణంలో గ్రంథాలయం అభివృద్ధికి ఎంతగానో బాబ్జి సేవలందించారు అన్నారు. సమ్మర్ క్యాంపులు నిర్వహించడం, దాతల ద్వారా పుస్తకాలు తెప్పించడం, వంటి విషయాలలో బాబ్జి కృషి ఎనలేనిది అన్నారు. అటువంటి వ్యక్తికి జిల్లా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు రావడం చాలా సంతోషం ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి అవార్డులు బాబ్జి మరెన్నో స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అరుణ్, పట్టణ ఉపాధ్యక్షులు మహేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

